వరివడిగా సాగుతూ...

- మెట్టలో చురుగ్గా ఖరీఫ్ పనులు
- అన్నదాతలకు ఉత్సాహాన్ని ఇచ్చిన వర్షాలు
- నియోజకవర్గంలో 22 వేల ఎకరాల్లో సాగు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఖరీఫ్ సాగు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అల్పపీడన ద్రోణి, రుతుపవనాల ప్రభావంతో కొద్ది రోజులుగా వర్షాలు పడటంతో సాగు పనులు ఊపందుకున్నాయి. నియోజకవర్గంలో సుమారు 22 వేల ఎకరాల్లో సాగు చేపట్టేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. నారుమళ్లు సిద్ధం కావడంతో కొన్నిచోట్ల దమ్ములు ప్రారంభించారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, తిరుమాలి, యర్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో ట్రాక్టర్లతో దమ్ము పనులు నిర్వహిస్తున్నారు. సుమారు 4 వేల ఎకరాలకు పైగా సాగు చేయనున్నారు. తిమ్మరాజు చెరువు ఆయకట్టు పరిధిలో రైతులు చురుగ్గా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు.

వెదజల్లు, డ్రమ్ము సీడర్ పద్ధతుల్లో..

కూలీల సమస్య లేకుండా వెదజల్లు, డ్రమ్ముసీడర్ పద్ధతుల్లో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో కూలీల సమస్యను అధిగమించడంతో పాటు తక్కువ ఖర్చుతో సాగు చేయవచ్చు. ఈ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా దిగుబడి పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తిమ్మరాజుచెరువు ఆయకట్టు మినహా మిగిలిన


ఏలేశ్వరంలో ట్రాక్టర్‌తో దమ్ములు

గ్రామాల్లో ఇతర పంటలైన వంగ, బీర, దోస, అరటి, చెరకు తదితర పంటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

కూలీల కొరతతో ఇక్కట్లు

వ్యవసాయ పనుల్లో కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు చెందుతున్నారు. అన్ని గ్రామాల్లోనూ ఒకేసారి పనులు ప్రారంభం కావడంతో కూలీలు దొరకని పరిస్థితి తలెత్తింది. దీంతో పాటు వ్యవసాయ పనులపై కూలీలకు ఆసక్తి లేకపోవడంతో కూలీధరలు పెంచి ఇస్తున్న అటువైపు చూసే వారు కరువైన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు యంత్రాలు, ఆధునిక విధానాలను అవలంబిస్తున్నారు.


వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. రైతులు విత్తనాలు వేసేటప్పుడు విత్తనశుద్ధ చేసుకోవాలి. నీటి వసతులు తక్కువగా ఉన్నచోట వెద జల్లు విధానంలో సాగు చేసుకోవాలి. రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. – **జ్యోతి,** మండల వ్యవసాయశాఖ అధికారి, ఏలేశ్వరం

ఖరీఫ్ పనులు ప్రారంభించాం



ప్రస్తుతం వర్షాలు పడుతుండడతో ఖరీఫ్ పనులు ప్రారంభించాం. వర్షాలతో పాటు చెరువులపై ఆధారపడి సాగు చేపడుతున్నాం. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో నాట్లు ఆలస్యమయ్యాయి. భవిష్యత్‌లో వాతావరణం అనుకూలించి మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం. – **నతివాడ సత్యనారాయణ,** రైతు ఏలేశ్వరం

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు

తుని రూరల్: మండలంలోని కొత్త సూరవరంలో పరదేశమ్మ బాలభక్త వినాయక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో బుధవారం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా నల్లల వరహాలు, కార్యదర్శిగా తర్రా దొరబాబు, కోశాధికారిగా ప్రగడ రమేష్, ఉపాధ్యక్షుడిగా బద్ది కృష్ణ, సహాయ కార్యదర్శిగా రెడ్డి వీరబాబు, ఉప కోశాధికారిగా కర్రి ప్రసన్న కుమార్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, కమిటీ మాజీ అధ్యక్షుడు వేముల శివ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పరదేశమ్మతల్లి, టి.తిమ్మాపురంలో మహావిష్ణువు ఆలయాలను యనమల కృష్ణుడు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్


ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సత్యదేవుని ప్రసాదాలు అందిస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆలయకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ప్రసాదాన్ని ఏఈఓ కృష్ణారావు అందజేశారు. ఆయన వెంట స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు, ఏఎస్ఐ రాంబాబు తదితరులు ఉన్నారు.

కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు బహిరంగ వేలం

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి బుధవారం తెలిపారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే పాటదారులు ఆధార్ కార్డు జెరాక్స్‌తో పాటు ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. వేలంలో వాహనాన్ని దక్కించుకున్న పాటదారుడు పాడిన మొత్తం సొమ్ముతో పాటు 12 నుంచి 18 శాతం జీఎస్టీ సొమ్మును తక్షణమే చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 94417 48547, 99895 66535 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం

తుని: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని అధికారులు చేసినా ప్రయత్నాలు సఫలం కావడం లేదు. పట్టణ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరిపే హోల్‌సెల్ దుకాణదారులకు నోటీసులు ఇచ్చినా ఫలితం లేదు. మార్కెట్‌లోని కూరగాయలు, హోటల్స్, చేపలు, కిరాణా తదితర వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను కొనుగోలుదారులకు ఇస్తున్నారు. వీటిని మురుగనీటి కాలువల్లో వేయడంతో నీటి ప్రవాహనికి అంతరాయం ఏర్పడుతోంది. ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి సరకు సీజ్ చేస్తున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపారు. ప్లాస్టిక్ బదులు కాగితం, క్లాత్ సంచులను ప్రజలు వినియోగించాలని ఆయన కోరారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం


బొద్దవరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో విశ్వమానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిచారు. సంస్థ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్యం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి నెలా మూడో బుధవారం నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేస్తుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు గ్యారంటీ

కరప: నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పించుకుని, ప్రణాళికా బద్ధంగా చదివితే సీటు గ్యారంటీగా సాధించవచ్చని ఎంఈఓ-2 పి.సత్యనారాయణ పేర్కొన్నారు. అరట్లకట్టలోని మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నవోదయ, సైనిక్ స్కూళ్ల గురించి, అక్కడ అందించే విద్య గురించి వివరించారు. ఆయా స్కూళ్లల్లో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈపాఠశాల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. నవోదయ, సైనిక్ స్కూళ్ల ప్రవేశపరీక్ష గురించి ఏయే సబ్జెక్టులు ఉంటాయి, ఎలా ప్రిపేర్ అవ్వాలో రీజనింగ్, ఇంగ్లిష్, జీకే, మాథ్స్, బయాలజీ ఫ్యాకల్టీస్ ఎస్.ధనరాజ్, ఏవీఆర్ నరేష్‌బాబు, వి.గోపాలకృష్ణ, జి.నాగేశ్వరరావు, పి.విజయ్, పి.కిశోర్ వివరించారు. గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి, ఎంపీటీసీ సీహెచ్ కామేశ్వరి, గోపి గణేష్, ఎస్.దేవి, వెలుగుబంట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎన్.విశ్వేశ్వరరావు, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు అరికట్టాలి

సామర్లకోట: పెద్దాపురం పట్టణ పరిధిలో ఇటీవల కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టాలని చేనేత సంఘ రాష్ట్ర నాయకుడు ముప్పన వీర్రాజు అన్నారు. బుధవారం సాయంత్రం సైబర్ నేరాలకు సంబంధించి ఆయన పెద్దాపురం ఎస్సై సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఫేస్‌బుక్‌లో సైబర్ నేరానికి సంబంధించిన వ్యక్తుల నుంచి బెదింపులు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వీర్రాజు తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు


సూరంపాలెం గుల్లమెట్టపై మైనింగ్ తవ్వకాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

గండేపల్లి: అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి హెచ్చరించారు. మండలంలోని సూరంపాలెం రామేశంపేట గుల్లమెట్ట ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గండేపల్లి, ప్రత్తిపాడు రౌతులపూడి మండలాల్లో అనుమతులు లేని క్వారీల్లో మైనింగ్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను ఇప్పటికే సీజ్ చేసినట్టు తెలిపారు. గ్రావెల్ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గుల్లమెట్టపై 234 ఎకరాలకు గాను 216 ఎకరాలు అసైన్డ్ భూములని, మిగిలినవి జిరాయితీ భూములుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేంతవరకూ ఎటువంటి మైనింగ్ కార్యకలాపాలు చేపట్టరాదన్నారు. రెవెన్యూ, గనులు, విజిలెన్స్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా గనుల శాఖ డీడీఈ నరసింహారెడ్డి, జిల్లా విజిలెన్స్ నిఘా విభాగం అధికారి సురేష్‌రెడ్డి, గండేపల్లి, పెద్దాపురం తహసీల్దార్లు జె.చిరంజీవి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హైవేపై మృతుడి బంధువుల నిరసన

శంఖవరం: కాకినాడ-కత్తిపూడి జాతీయ రహదారిపై బుధవారం మృతుడి బంధువులు, ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పిఠాపురం గ్రామానికి చెందిన మోర్త గవరయ్యకు కత్తిపూడిలో భూమి ఉందని పది సంవత్సరాల క్రితమే ఫైనాన్స్ కంపెనీ వాళ్లకి, తరువాత ఇతర పార్టీకి అగ్రిమెంట్ చేసి డబ్బులు తీసుకున్నాడు. అప్పటి నుంచి భూమి తగాదాల్లో ఉంది. ఈ గొడవలతో బెంగ పెట్టుకున్న గవరయ్య (75) బుధవారం మృతి చెందాడు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ట్రాఫిక్ సంభించడంతో ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ సంఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు చేస్తామని


కత్తిపూడి-కాకినాడ హైవేపై నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు

పోలీసులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. దీనిపై మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'యంగ్ మైండ్స్' పోస్టర్ ఆవిష్కరణ

బాలాజీచెరువు: స్థానిక ఫారెస్ట్ కార్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన యంగ్ మైండ్స్ సేవా సంస్థ అవగాహన సదస్సు, పోస్టర్‌ను ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి యంగ్ మిడ్డే టీమ్‌తో ఆవిష్కరించారు. ఈ నెల 21వ తేదీన విద్యార్థులకు ఐఐటీ చదువులపై, యువతకు పోటీ పరీక్షలు, కెరీర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు. యువతలో క్రియేటివిటి పెంపొందించుట, విద్యార్థి దశ నుంచి సైన్సు ప్రయోగాలు, పర్యవరణ పరిరక్షణ, మొక్కలు నాటడంపై ఆసక్తి కలిగించడం, వైద్యసలహాలు, సూచనలు, రక్తదానం సేవా కార్యక్రమాలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాల సంస్థ ద్వారా చేపడతామని సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ తెలిపారు. సంస్థ అధ్యక్షుడిగా తాను, కార్యదర్శిగా డి.బాపిరాజు, ఉపాధ్యక్షుడిగా పడాల ఏడుకొండలు, గౌరవ అధ్యక్షుడుగా నరాల కబుష్టకుమార్ సభ్యులుగా కంచుమర్తి రామకబుష్ట, బి.మంగారావు, పి.ఇందిరాగాంధీ, వై.నీరజ, ఎ.వెంకటరమణ తదితరులు ఉన్నారన్నారు. ఈ అవగాహన సదస్సులో ప్రముఖ గణిత, సైన్సు కోవిదులు, ఐఐటీ, ఐఏఎస్, ఐపీఎస్ ర్యాంకర్లు విద్యావేత్తలు, ప్రముఖులు, విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు


ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు


ఏకాహం నిర్వహిస్తున్న మహిళలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: తొలి ఏకాదశి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గ్రామాల్లోని రామాలయాల్లో ఉదయం నుంచి 24 గంటల పాటు ఏకాహం నిర్వహించారు. పట్టణంలోని పలు రామాలయాల వద్ద వివిధ భజన బృందాల సభ్యులు ఏకాహం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లలితాసహస్ర పారాయణ

ఏలేశ్వరం: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శివ స్తోత్రాలు, లలితాసహస్ర పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం ఆలయానికి వింజమరాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ మహిళాసభ్యులు సూర్యకుమారి, ఇందిరా, గిరిజ, మంగ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన కైలాస గణపతిస్వామికి బుధవారం వేదపండితులు, ప్రధానార్చకులు పంచామృతాభిషేకం, శాస్త్రోక్తంగా గరిక పూజ, గణపతి హోమం నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేదపండితులు కైలాస గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా తలుపులమ్మ అమ్మవారికి లక్ష తులసి పూజ నిర్వహించారు. తులసి దళాలతో అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఏకాహం

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి రామాలయంలో బుధవారం ఏకాహం నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భజన బందాల సభ్యులు భజనలు చేశారు. మూడు రోజుల పాటు ఈ ఏకాహం నిర్వహించనున్నట్టు తెలిపారు.


లోవదేవస్థానంలో తలుపులమ్మ తల్లికి తులసి దళాలతో విశేష అలంకరణ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తొండంగి: ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని వైష్ణవాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. దానవాయిపేట శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏవీ నగరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, యర్రయ్యపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో భజనలు, భక్తిగీతాలాపన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్రపర్వం.. పాండురంగని కల్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన పండితులు
- కల్యాణ వేడుకను తిలకించిన భక్తులు

సామర్లకోట: పట్టణంలో పాండురంగ స్వామి కల్యాణం బుధవారం నేత్ర పర్వంగా జరిగింది. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పాండురంగ స్వామి ఆలయంలో ప్రతి ఏడాది ఆషాడ మాసం తొలి ఏకాదశి పర్వదినంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. తొలి ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఈ మేరకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు అయోద్యల పద్మ రాజేంద్రకుమార్, రాజేష్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. నూతనంగా వివాహం అయిన దంపతులు స్వామివారిని దర్శించుకోవడం ద్వారా సంతానం కలుగుతుందనే నమ్మకం. ఈ మేరకు ఇటీవల వివాహం అయిన దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 190 ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం కావడంతో ఒకవైపు మార్గం మాత్రమే ఏర్పాటు చేశారు. దాంతో వీఐపీలు కూడా క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకోవాల్సి వస్తోంది. ఆలయం నుంచి కిలోమీటరు పొడవున భక్తులు బారులుతీరారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అయోద్యుల రాజేష్, కృష్ణవేణి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. పంచారామ క్షేత్ర అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి వేద మంత్రాల మధ్య కల్యాణం పూర్తి చేశారు. రుక్మిణి సమేత పాండు రంగ స్వామి కల్యాణం తిలకించడం వలన పాపాల తొలగిపొయి సుఖసంతోషాలతో ఉంటారని వేమూరి సోమేశ్వరశర్మ భక్తులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను వివరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పానకం, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలను అందజేశారు.


సామర్లకోటలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం

వ్యాధుల కాలం.. జీవాలు భద్రం

- మూగజీవాలకు పొంచి ఉన్న సీజన్ ముప్పు
- రైతులు అప్రమత్తంగా లేకుంటే పెను ప్రమాదం
- పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వైద్యుల సూచన

ప్రత్తిపాడు: వర్షాకాలం వచ్చేసింది. కొద్దిరోజులుగా వర్షాలు పడుతున్నాయి. ఈ కాలంలో జోరీగలు, దోమల కారణంగా మూగజీవాలకు పలు రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండి వ్యాధుల బారి నుంచి మూగజీవాలను కాపాడుకోవాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా పశుసంపదను కోల్పోక తప్పదు. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి పశువైద్యులను సంప్రదించాలని పశు సంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ వివరించారు.

వ్యాధులు - వాటి లక్షణాలు

పీపీఆర్ వ్యాధి

వర్షాకాలంలో వైరస్ వల్ల గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెల్లో 106 డిగ్రీల జ్వరం, ముక్కు నుంచి నీరు కారడం, నోటిలో పుండ్లు, విరేచనాలు వంటి లక్షణాలను గమనించవచ్చు. ఈ వ్యాధి సోకితే పశువులు


గొర్రెలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ డాక్టర్ వరలక్ష్మి

ఆహారం తీసుకోవడం మానేసి మృతి చెందుతాయి. పీపీఆర్ టీకాను ముందస్తుగా వేయిస్తే ఈ వ్యాధిని నివారించవచ్చు.

కాలిపుండు వ్యాధి

ఈ వ్యాధి సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనుకపడతాయి. సరిగా నడవలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలిపుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన చెడువాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

చిటుక వ్యాధి

చిటుక వ్యాధి క్లాస్ట్రీడియం అనే సూక్ష్మక్రిమి వల్ల వస్తుంది. తొలకరి చినుకులు పడిన తర్వాత వచ్చిన పచ్చికను గొర్రెలు, మేకలు మేసినప్పుడు ఈ వ్యాధిని కలుగజేసే సూక్ష్మ క్రిములు వాటి కడుపులోకి ప్రవేశించి కొన్ని విష పదార్థాలను విసర్జించడం వల్ల ఈ వ్యాధి కలుగుతుంది. మేకలు, గొర్రెలకు చిటుక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ఈ టీకాలు వేసే సమయానికి నెల రోజుల ముందుగా గొర్రెలన్నింటికీ నట్టలు, బద్దె పురుగు నివారణ మందులు తాగించాలి.

- జలగలు ఆకు రంగులో ఉంటాయి. చెరువులు, కాలువలు, కుంటలు, తేమ, పచ్చిక బయల్లో మేపడం ద్వారా జీవాల లోపలికి ప్రవేశించి జీర్ణాశయం నుంచి కాలేయాలనికి చేరుతాయి. వీటి వల్ల కామెర్లు వచ్చి రక్త హీనత ఏర్పడుతుంది. ఆకలి మందగిస్తుంది. గుండె దగ్గర నీరుచేరి వాపు ఉండడం వీటి లక్షణం.
- ఏలిక పాములు మూగజీవాల కడుపులోకి చేరి జీర్ణాశయం గోడలకు అంటిపెట్టుకుని రక్తాన్ని పీలుస్తాయి. వీటి సంఖ్య వందల్లో ఉంటుంది. దీంతో జీవాలు ఎదుగుదల పూర్తిగా ఆగిపోతుంది. జీవాలు బక్కచిక్కిపోతాయి. వీటితో పాటు అనేక రకాలైన వ్యాధులు సోకే అవకాశం ఉంది.

ముందస్తు జాగ్రత్తలు ఇలా..

- వర్షాకాలంలో మేకలు, గొర్రెలను పాకల్లోనే ఉంచాలి.
- బురద, చిత్తడి నేలల్లో తిరగకుండా చూడాలి.
- రెండు అంగుళాల ఎత్తు ఉండే గడ్డి మొక్కలు ఉండే చోటులో జీవాలను మేపాలి. పరిశుభ్రమైన నీరు తాగించాలి. పరిసరాలు శుభ్రంగా ఉండాలి.
- జీవాల పేడను పరీక్ష చేయించి, వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి.
- కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరుచేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉంచాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఎటువంటి వ్యాధి లక్షణాలున్నా వెంటనే సంబంధిత పశువైద్యాధికారిని సంప్రదించి నివారణ చర్యలు, సలహాలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు మందులు వేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో పశువులకు వ్యాప్తి చెందే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు గొర్రెలు, మేకల ఆరోగ్యం పరిశీలిస్తుండాలి. ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. సమీపంలో ఉండే పశుసంవర్ధక వైద్యులు, సహాయకులను సంప్రదించాలి. – **డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్,** అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, ప్రత్తిపాడు

నియోజకవర్గంలో మూగ జీవాల వివరాలు

మండలం	మేకలు	గొర్రెలు	మొత్తం
ప్రత్తిపాడు	6,064	7,244	13,308
ఏలేశ్వరం	9,396	13,307	22,703
రౌతులపూడి	10,871	5,589	16,460
శంఖవరం	8,309	7,932	16,241
మొత్తం	34,640	34,072	68,712

మండలాభివృద్ధే లక్ష్యం

కోటనందూరు: మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో బుధవారం సాయంత్రం శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడుతో కలిసి ఆమె విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రోటరీ గోల్డ్ రథసారథిగా శ్రీకాంత్


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్

బోట్‌క్లబ్: స్థానిక రోటరీ హాల్‌లో బుధవారం రోటరీగోల్డెన్ జూబ్లీ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా శిష్టా శ్రీకాంత్, కార్యదర్శిగా దామెర శ్రీకాంత్, కోశాధికారిగా పి.స్వరూప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసిస్టెంట్ గవర్నర్‌గా ధనసాగర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పేపకాయల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా చార్మినార్ వర్మ, ఇంటరాక్టు క్లబ్ చైర్మన్‌గా ఎస్.చిరంజీవిరెడ్డి, ఇంటర్నేషనల్ సర్వీసెస్ చైర్మన్‌గా వాడ్రేవు రవి ఎన్నికయ్యారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో మరెన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.